## కథ

# అమ్మ మనసు

-జె. సరస్వతి

ఆరోజు సంక్రాంతి.

సంక్రాంతి పండగంటే సంబరం లేనిదెవ్వరికి!

ఊరంతా ఉత్సాహం. అందరి మొహాలూ ఆనందంతో కళకళలాడుతున్నాయి. పిల్లల హడావుడికి అంతేలేదు.

అందరికీ అంతంత వుషారు తెచ్చిన పండగ పాపం సీతాలు మనసులో చెప్పలేనంత అలజడి రేపింది.

ఆ రోజునే కాదు, అంతకు ముందు రోజు నుంచే దాని మనసు అదోలాగైపోయింది. ఇదీ అని చెప్పలేని బాధ గుండెలనిండా వ్యాపించి దాని చిన్న మనసును కదిలించి వేసింది.

దీనికంతటికీ కారణం రాధ.

రాధ కస్తూరి కూతురు. సీతాలు వయసే వుంటుంది. తల్లి గారాబంతో చదువు సాగడం లేదని తాతా నానమ్మల దగ్గర వుంచి చదివిస్తున్నారు పొరుగూరిలో. ఇప్పుడు సంక్రాంతి శలవలకని వచ్చిందా అమ్మాయి. తండ్రి వెంట పెట్టుకొచ్చాడు.

సీతాలు కస్తూరిగారింట్లో పనిలో చేరి నాలుగు నెలలైంది. అంచేత రాధను చూడ్డం తటస్థ పడలేదు. రాధ తర్వాత కవల పిల్లలు. ఇద్దరూ మహాగడుగ్గాయిలు. వాళ్ళతో పని తెమలక సీతాలుని పనిలో పెట్టుకుంది కస్తూరి ఇంట్లోనే వుండేలా.

ప్రతి నెలా తల్లి వచ్చి జీతం పట్టుకుపోతుంది. ఈ నాలుగు నెలల్లో అది ఇంటికి ఒక్కసారి కూడా వెళ్ళలేదు. అసలు వెళ్లాలన్న ధ్యాస కూడా రాలేదు దానికి. కస్తూరి బాగానే చూసుకుంటుంది. ఒక పూట తిని ఒక పూట తినకా పస్తుండేది ఇన్నాళ్ళూ. ఇక్కడ రెండు పూటలా కూరలతో కడుపునిండా అన్నం, టిఫిన్లు. ఇంకేం కావాలి! ఆనందంగానే వుంటోంది. కానీ రాధ ఆగమనం ప్రశాంతంగా వున్న సెలయేటిలో రాయి వేసినట్లు దాని మనసు ఏవేవో ఆలోచనలతో అల్లకల్లోలంగా వుంది.

నిన్నటికి నిన్న...

వాకిట్లో రిక్షా ఆగిందే తడవు చేతిలో వున్న పని వదిలిపెట్టి పరుగున వెళ్లింది కస్తూరి. పదేళ్ల పిల్లనీ అమాంతం ఎత్తుకుని ముద్దులు కురిపించింది ''ఎన్నాళ్లయిందమ్మా నా తల్లిని చూసి. వెధవ చదువులు కాదుగాని చిక్కి సగమయ్యావు'' అంది వళ్లంతా తడిమి చూసుకుంటూ.

''బడితెలా వుంది పిల్ల. చిక్కిందా!'' నోరు వెళ్ళబెట్టుకు చూసింది సీతాలు.

రిక్షావాడికి డబ్బులిచ్చి వచ్చిన మూర్తి నవ్వుకుంటూ ''ఇంకా మూడు రోజులుంటుందది. తీరిగ్గా బాధపడుదువుగాని. నాకేమన్నా కాఫీ గట్రా చూసేదుందా!'' అన్నాడు నవ్వుతూ.

''మీకంతా నవ్వులాటగానే వుంటుంది లెండి. సుఖంగా వున్న పిల్లని చదువో చదువో అంటూ తీసుకుపోయారు. ఇక్కడ చదివేది చాలదా! అదేం ఉద్యోగాలు చెయ్యాలా ఊళ్లేలాలా! రావే రాధా నీకిష్టమని నువ్వుపప్పు వేసి అరిసెలు వత్తాను. వాము వేసి కారపూస చేశాను. ఇవాళేమో....పులిహోరా, పాయసం చేస్తాను..రేపు...''

అమ్మగారి ఆనందోత్సాహాలని అద్భుతంగా చూడసాగింది సీతాలు. రాధకు నలుగుపెట్టి స్నానం చేయిస్తూ, రకరకాల కబుర్లు చెపుతూ అన్నం తినిపిస్తూ ప్రేమలో ముంచెత్తుతున్న అమ్మగారిని చూస్తుంటే క్రొత్తగా వింతగా అనిపించసాగింది.

ఒక్కో సంఘటనా దాని చిన్ని మనసులో చిత్రమైన స్పందన కలగజేయసాగింది. తాగొచ్చి తల్లిని చావబాది పిల్లల్ని చీదరించుకునే అయ్య. నూకలికి డబ్బులియ్యలేదని మొగుడ్ని శాపనార్థాలు పెడుతూ ఆ కోపం తమ మీద చూపించే తల్లి...అదే తెలుసు తనకి. కొద్ది మార్పులతో చుట్టూవున్న ఇళ్లల్లో కూడా అదే తంతు.

ఒకవేళ దూరాన వుండే పిల్లల మీద ఆపేక్ష పెరుగుతుందా! ఇన్నాళ్లాయె తను ఇంటికిపోక, ఇప్పుడుగాని వెళితే అమ్మ కూడా అమ్మగారిలాగే ముద్దు చేస్తుందా! 'ఎన్నాళ్లాయెనే నిన్ను చూసి, ఎట్లున్నవె నన్నొదిలి పెట్టి' అంటుందా! ఊహామాత్రంగానే దాని మనసు గాలిలో తేలిపోయినట్లుగా వుంది.

'అవును, వెళ్లాలి. అమ్మ దగ్గరకెళ్లాలి' అణువణువూ ఆర్తితో నిండిపోయింది.

అంతలోనే అనుమానం. అమ్మగారు పంపిస్తారా? అందునా పండగ పొద్దు. పనెక్కువుండేది ఇయ్యాళేగా. ఎలా అడగాలి? ఏమని అడగాలి?

కానీ ఎలాగైనా సరే వెళ్లాలి. అమ్మని చూడాలి. మంచిగ పనులు చేసి అమ్మగారిని మెప్పించి అప్పుడు అడుగుతా..

''కాఫీ గిన్నెలు కడగడానికెళ్లి అక్కడే పాతుకుపొయ్యావేమే!'' కస్తూరి కేకలతో ఊహల్లోంచీ బయటపడింది సీతాలు. కంగారులో చెయ్యి జారి కప్పు క్రింద పడింది. గచ్చునేలకి గాజు సామానంటే ముద్దా! నాలుగు చెక్కలైందది.

''నీకే దయ్యం పట్టిందే! పొద్దుట్నించీ చూస్తున్నా పన్లన్నీ అధ్వాన్నం చేస్తున్నావు?'' కస్తూరి కోపం తారాస్థాయికి చేరింది. ఖరీదైన టీ సెట్టులోని కప్పది.

జలజల నీళ్లురాలాయి సీతాలు కళ్లల్లోంచి.

''సడేలే సంబడం. నీళ్లకుండ నెత్తిమీద వుంటుంది. మిగిలినవాటినన్నా జాగ్రత్తగా అఘోరించు..'' అందావిడ ఇంట్లోకి వెళుతూ.

ప్రొద్దున్న టిఫిన్లు చేసేటప్పుడు రాధ పరుగెత్తుకు రావడంతో కాలు తగిలి గాజు గ్లాసు పగిలింది. ''చూసుకుని నడవరుటె తల్లీ. గాజు ముక్క గుచ్చుకుందో ఏమో. ఏదీ చూడనీ...'' అంటూ కూతుర్ని వళ్లో కూర్చోపెట్టుకుని కాలు పరీక్షించి తృప్తిపడింది.

పెంకులెత్తి తడిగుడ్డతో తుడవడం తన వంతు.

కళ్లు తుడుచుకుంది సీతాలు.

తను కూడా అమ్మ దగ్గరుంటే ఈ పనులన్నీ చేసేదా! చక్కగా తమ్ముడుతో చెల్లెళ్లతో ఆడుకుంటూ వుండేది. తమ్ముడు తనొచ్చేసరికి మూడో నెల మంచిగ నవ్వుతుండే వాడు. ఇప్పుడు నడుస్తుంటాడేమో. అమ్మ ఏమీ చెప్పదు. తనకి అడగాలంటే నోరు పెగలదు. అసలామె ఇక్కడుండేదే కాస్తంత సేపు. ఆ కాసేపూ అమ్మగారితో ఇంట్లో బాధలు చెప్పుకొని ఏడుస్తుంది. ''జీతం తీసుకుని పోతున్నానే సీతాలు. అమ్మ జెప్పినట్టు మంచిగా పని జెయ్యి'' అని పోతుంది. అంతే, అదీ నెలకొక్కసారి.

ఇయ్యాల నామాటే యాది చేస్తావుంటాదేమో! పండగ దినమని పోలెలు గట్ట చేసుద్దేమో...అమ్మజేసిన పోలెలు ఎంత మంచిగ వుంటయ్యో...సీతాలు నోట్లో నీళ్లూరాయి.

అమ్మ వళ్లో కూచొని దినుకుంట ఈడ సంగతులన్నీ జెప్పాలె. ''ఏందె యిట్ట చిక్కిపోయిన వేమే'' అంటది అమ్మగారి లెక్క.

సీతాలు వళ్లు పులకరించిపోయింది.

'అమ్మా! వస్తనే..ఎట్టనన్న వస్తనే నీకాడికి..'

''కళ్లు తెరుచుకునే నిద్రపోతున్నావా ఏమే..బక్కెటు నిండి నీళ్లలా పోతుంటే నల్లా బందు చెయ్యవూ'' కస్తూరి గొంతు విని వులిక్కిపడింది సీతాలు.

అమ్మగారిని మంచి చేసుకోవాలంటే అన్నీ పొరపాట్లే జరుగుతున్నాయి. ఇకనైనా జాగ్రత్తగా వుండాలి అనుకుంది భయంగా.

ఆలోచన ఆచరణలో పెట్టకుండానే సాయంత్రమయింది. కొత్త బట్టలు కట్టుకుని, నగలు సింగారించుకుని షికారు బయలుదేరుతున్నారంతా.

సీతాలుకి కంగారొచ్చింది. చీకటి పడిపోతుంది వాళ్లు తిరిగొచ్చేసరికి.

తనకోసం ఎదురుచూస్తూ గుడిసె ముందు నిలబడ్డ తల్లి కళ్ల ముందు నిలిచింది. ఇంక ఆగలేకపోయింది సీతాలు. గుండెల నిండా ఊపిరి తీసుకుంది ''అమ్మగారూ..'' అంది దేవుడ్ని తలుచుకుంటూ.

పెద్దగా పిలిచాననుకుందది. పెదాలు కదిలాయంతె. నిలువుటద్దం ముందు నిలబడి చీర అంచులు సవరించుకుంటున్న కస్తూరి అసలు గమనించనే లేదు.

''అమ్మా! సీతాలు పిలుస్తోందే'' చెప్పింది రాధ.

''గిన్నెలో నాలుగు గారెలు పెట్టా నీకని. తిని గిన్నె కడిగి బోర్లించు'' అందావిడ తలైనా తిప్పకుండా.

''అది కాదమ్మ...'' నసిగింది సీతాలు.

''ఏమిటే?'' చిరాగ్గా చూసింది. అదలా గుడ్లు మిటకరించుకుని చూస్తూ నిలబడుంటే ఎలా సర్దుకోబుద్ధవుతుంది!

''మా ఇంటికెల్లొస్తనమ్మా..'' గుటకలు మింగుతూ పలికిందెలాగో.

''ఏమిటీ!'' కళ్లు పెద్దవి చేసి చూసిందామె.

''ఇంటికెళతావా? ఇప్పుడెళ్లి మళ్లీ ఎప్పుడొద్దామని?''

''ఇప్పుడే వస్తానమ్మా'' గబగబా అంది ఆశగా చూస్తూ.

''చాల్లే. నవ్విపోయేరు. అయిదయింది గంట. ఇప్పుడెళ్లి టీ ఇప్పుడే వస్తుందిట. అది మనసులో పెట్టుకునేనా పనంతా తగలెడుతున్నావు పొద్దుట్నించీ..''

''అదిగాదమ్మా, ఒక్క గంటలో తిరిగొచ్చేస్తా. మీకన్నా ముందుగాలే వచ్చి వాకిట్లో కూచోనుంటా చూడండి'' ఊ అంటే చాలన్నట్లు చూసింది ఆమె కళ్లల్లోకి.

''ఒక్క గంటలో ఎలా వస్తావే? మీయమ్మ రానిస్తుందా?''

''మా యమ్మవుండమన్నా వుండనమ్మా. మీరే చూస్తారుగా..''


''ఆ, అన్నీ ఇక్కడి మాటలే. ఏ కడుపు నొప్పో, కాలునొప్పో వచ్చిందని వంకపెడితే సరి వెళ్లాక'' ఆమె భయం ఆమెది.

''పోనీ వెళ్లనివ్వరాదుటే..పన్లన్నీ అయిపోయాయిగా'' అన్నాడు మూర్తి చదువుతున్న పేపరు మడుస్తూ.

''ఎలా వెళ్తుందండీ! రేపు కనుమాయె..రాధ వెళ్లేటప్పుడు..''

''కనుమా, నీ మొహమా..పండగ పేరుతో నానా చెత్తా తయారుచేస్తావు. నీకు నీరసం, మాకు అజీర్తి. నిన్నా యివాళా చేసినవి చాల్లే. వెళ్లనీ దాన్ని..''

''అదిగాదండీ, అమ్మాయికి కాస్త మినపసున్నీ, చేగోడీలు చేసిద్దామని..అయినా నీ



కిక్కడేం తక్కువైందనే! మా పిల్ల లతోపాటే పెడుతున్నాంగా..'' నిష్టూరంగా అంది కస్తూరి.

''చూడు కస్తూరీ, ఎవరెంత బాగా చూసినా తల్లిమీద ధ్యాసలే కుండా వుండదు. అదీ చిన్నపిల్ల. పోనీ, అంతగా అది రాకపోతే నేను చేస్తాగా నీకు సహాయం'' భరోసా యిచ్చాడు మూర్తి.

''తినడంలోనా...'' నవ్వింది కస్తూరి.

''ఎందులోనైతేనేం సాయపడు తున్నానా లేదా అన్నది ప్రశ్న''

''ఇంకేం, వెళ్లవే.. అయ్యగారి సపోర్టు దొరి కిందిగా'' అందామె అయిష్టంగానే. సీతాలు మనసు విహంగమే అయింది.

''ఎల్లొస్తనమ్మా..'' పరుగందుకోబో యింది.

''ఏంటే ఆ తొందర. ప్రక్కవీధిలో వుంద నుకున్నావా మీ ఇల్లు. మైలు దూరం నడిచి వెళ్లి నడిచి వచ్చేసరికి మళ్లీ సంక్రాంతి వస్తుంది. డబ్బులిస్తాగాని బస్సెక్కు. ఆ గారెలు తిని వెళ్లు. మళ్లీ ఎప్పుడొస్తావో'' అంది పది రూపా యల కాగితం ఇస్తూ.

తెల్లగా బిరుసుగా గర గర లాడుతూ కొత్త పది రూపాయల నోటు. ఎంత బాగుంది! ఇది అమ్మకిస్తే!


ఆ ఆలోచన సీతాలుకెంతో నచ్చింది. నల కుండా భద్రంగా బొడ్లో దోపుకుని వంటిం ట్లోకెళ్లింది. అల్లం, పచ్చిమిర్చి వేసి ఎర్రగా వేపిన గారెలు. ఘుమ ఘుమలాడుతున్నాయి. చెల్లెళ్లు, తమ్ముడు గుర్తుకొచ్చారు. తినబుద్ధి కాలేదు. కాగితంతో చుట్టి లంగా కుచ్చెళ్లలో దాచుకుంది.

★ ★ ★

బోసి మొలలతో, చింపిరి జుట్లతో వీధిలో ఆడుకుంటున్న పిల్లలు సీతాలు అంత దూరాన వుండగానే గుర్తుపట్టారు. నాలుగు నెల్లాయె అక్కగారిని చూసి. క్రొత్తగా వింతగా అనిపిం చింది వాళ్లకి. ఆకలౌతున్నది అన్నం పెట్టమని అడిగినందుకు తలా నాలుగు దరువులు పడ్డా యప్పుడే. ఇంతట్లో గుడిసెలో కెళ్లడం క్షేమం కాదని నిర్ణయించుకున్న పిల్లలు ఆ మాటే మర్చిపోయి రివ్వున పరుగెత్తారు తల్లికి వార్తనం దించడానికి.

''అమ్మా! అమ్మా! అక్కొస్తుందే, అక్కొ స్తుందే'' కోరస్ పాడారంతా.

మొగుడ్ని తిట్టుకుంటూ పొరుగింట్లో బదులు తెచ్చిన నూకలు బాగుచేస్తున్న రాము లమ్మ గుండెల్లో రాయిపడింది.




''పండగపొద్దు ఎందుకొస్తున్నట్లు! ఏదో చేసింది ఏదో చేసింది..''

చేసిన పాటంతా తాగుడుకే పెడితే బువ్వెట్ల వస్తది? అని అడిగినందుకు పెళ్లాన్ని తన్ని రిక్షా తీసుకుని పోయాడు మొగుడు. నాలుగు రోజులైంది. ఎటుపోయాడో తెలియరాలేదు. ఇంకా పదిహేను రోజులు గడిస్తేగాని సీతాలు జీతం రాదు. అందాకా ఏం తినాలన్నా అని ఆలోచిస్తుంటే ఈ మిడిమాలమేంటి! మొగు డట్ల..పిల్లలిట్ల.

చాట వదలి బయటకొచ్చింది రాము లమ్మ.

నీరసంగా వున్నా చురుగ్గా అడుగులేస్తూ మెరుస్తున్న కళ్లతో వస్తోంది సీతాలు.

''ఎంత సక్కంగ నగాకుంట వస్తుందో..రానీ బుద్ధిజెప్త'' కసిగా అనుకుంది రాములమ్మ.

తుప్పతల, చిరుగుల చీర, చేతిలో కట్టె పేడు. వురుక్కుంటూ వచ్చిన సీతాలు తల్లి ఉగ్రనరసింహావతారం గమనించలేకపోయింది ''అమ్మా...! అమ్మా...!'' చేతులు చాపింది సంబరంగా.

''ఏం జేసినవే? ఎందుకు తోలేసింది ఆయమ్మ?'' జుట్టు పట్టుకుని గుంజుకుపో యింది లోపలికి.

ఇదిగో సాక్ష్యం అంటూ కొత్త పది రూపా యల నోటు రపీమని కిందపడింది. మేమూ వున్నాం అంటూ నాలుగు గారెలూ బండి చక్రాల్లా దొర్లాయి నాలుగు మూలలకి.

విషయం తేటతెల్లమయింది.

మహంకాళిలా విజృంభించింది రాము లమ్మ.

''ఇదానే నువ్వు జేసిన పని! నీకీ దొంగబు ద్దులేడివే! ఎంత దీసినవే? అయ్య సంపాద నంతా పాసిపోతందనా పని వదిలి పెట్టి వచ్చి నవు! ఏందింటవె యిగ. నిన్నూ..నిన్నూ'' సీతాలు వీపు మీద పిడిగుద్దులు పడ్డాయి.

ఆకలి మాట కూడా మర్చి పోయి చోద్యం చూస్తున్నారు పిల్లలు. అన్ని దెబ్బలు తిన్నా సీతాలు కంటి వెంట చుక్కనీరు రాలేదు. దిమ్మెరపోయినట్లు నిలు వుగుడ్లేసుకుని నిలబడిపోయింది.

దయ్యం పట్టిన దానిలెక్క అట్ల సూస్తవేమే..''ఎంత దీసి నవో ఏం జేసినవో చెప్పవూ..'' కట్టెపేడు పైకి లేచింది మళ్లీ.

''నేను తియ్యలేదమ్మా. నిన్ను చూసొస్తానంటే ఆయమ్మే ఇచ్చింది బస్సెక్కిపొమ్మని''

''ఆ..బస్సెక్కి అమ్మతానికి పోబడ్డా, పండ గపొద్దు పనిగట్టి చెయ్యొద్దు అని పైసలిచ్చి తోలిందా పెండ్లి పిల్లను. పదా..ఆయమ్మనే అడుగుతా..'' సీతాలు రెక్కబట్టి లాగింది బయటికి.

కళ్లెత్తి నిర్వికారంగా చూసింది సీతాలు తల్లి వైపు. నెమ్మదిగా చెయ్యి విడిపించుకుంది. ''నేబోతలే అమ్మా. నువ్వొద్దు'' వచ్చినదారినే అడుగులు వేసింది.

తల్లి వడి చేరాలన్న ఆనందంలో వచ్చేట ప్పుడు శ్రమ తెలియలేదు. ఇప్పుడు అడుగులు బరువుగా పడుతున్నాయి. 'తను కోరిందే మిటి? జరిగిందేమిటి?' అయోమయంగా వుందా పిల్లకు. అమ్మలందరి ప్రేమా ఒకే రకంగా వుండదా!

ఈడ్చుకుంటూ వెళ్తున్న కూతుర్ని చూసి రాములమ్మ కడుపులో చెయ్యిపెట్టి కెలికినట్ల యింది. గుండె కరిగి నీరయింది. వంట్లో సత్తువంతా తోడేసినట్లుగా అక్కడే కూలబ డింది. నా చేతులిరిగిపోనూ బిడ్డను ఎట్లాకొట్టి నానూ..పండగ పొద్దు ''అమ్మా! అంటూ వచ్చిన బిడ్డను కొట్టి కొట్టి ఎల్లగొట్టినాను'' అంటూ ఏడవసాగింది.

''ఆడే మంచోడయితే బిడ్డను పరా యింట్లో కూలికి పెడుదునా...'' ఏడుస్తూనే వుంది సీతాలును తలుచుకుని తన దరిద్రాన్ని తలుచుకునే రాములమ్మ.

సీతాలు ఒక్కసారి వెనక్కి తిరిగి చూసుంటే ఎంత బాగుండేది. పిల్లల మీద అమ్మలందరి గుండెల్లో ప్రేమ ఒకేలా వుంటుం దని, దారిద్ర్యమనే భూతం దాన్ని వెలిబుచ్చే అవకాశం లేకుండా చేస్తుందని కొంతైనా తెలు సుకోగలిగేది కదా!

పాపం సీతాలు! పాపం రాములమ్మ!

☆